క్లుప్తంగా

జీడీనెల్లూరు పీఎస్‌లో ఆకస్మిక తనిఖీ



గంగాధరనెల్లూరు పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ జాషువా

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను జిల్లా నూతన ఎస్పీ జాషువా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో రికార్డులను తనిఖీ చేసి సలహాలు, సూచనలు అందజేశారు. ప్రశాంత వాతావరణంలో రానున్న ఎన్నికల కోసం ఇప్పటి నుంచే ప్రణాళికల రూపొందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ రాజగోపాల్ రెడ్డి, సీఐలు గంగిరెడ్డి, శంకర్, ఎస్ఐ రామాంజనేయులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులు కావాలి

పుత్తూరు: స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ విద్యార్థులకు బోటనీ, బయోటెక్నాలజీ సబ్జెక్టులు బోధించడానికి అతిథి అధ్యాపకులు కావాలని ప్రిన్సిపల్ జి.శ్రీనివాసులురెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 16వ తేదీన కళాశాలలో జరిగే ఇంటర్వ్యూలకు సంబంధిత సబ్జెక్టులలో పీజీ పూర్తి చేసిన అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరు కావాలని తెలిపారు. పీజీతో పాటు యూజీసీ నెట్, ఏపీ సెట్, పీహెచ్‌డీ కలిగిన వారికి అధిక ప్రాధాన్యత ఉంటుందని వెల్లడించారు. వివరాలకు 81425 38870 నంబరులో సంప్రదించాలని కోరారు.

డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి



మురుగునీటి ప్రాంతాన్ని పరిశీలిస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో కార్వేటినగరం రోడ్డులో పేరుకుపోతున్న మురుగునీటిని తొలగించాలని స్థానికులు 'జగనన్నకు చెబుదాం'లో ఫిర్యాదు చేశారు. దీనిపై ఈఓపీఆర్డీ పురుషోత్తం, డీడీఓ శ్రీనివాసరావు మంగళవారం మురుగునీరు ఉన్న ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. నివాసాల వద్ద మురుగునీరు నిల్వ లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఈఓపీఆర్డీ పురుషోత్తం సూచించారు. మురుగునీరు నిల్వ చేరడం వల్ల అనేక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని బాధితుడు ఆనందయ్య అధికారులకు విన్నవించారు. సమస్యను పరిష్కరించాలని కోరారు. వీఆర్ఓ మురళి, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సింధూజ, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

నేడు మండలమీట్

నింద్ర: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలమీట్ జరుగుతుందని ఎంపీడీఓ భవానీ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ దీప అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభం అవుతుందని చెప్పారు. ఈ సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు హాజరు కావాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి



సీఐ ఓబులేసును సత్కరిస్తున్న సంఘ నేతలు

పుత్తూరు: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సీఐ ఓబులేసు సూచించారు. మంగళవారం స్థానిక గేట్‌పుత్తూరులోని క్యాబిన్ వద్ద జైభీమ్ ఆటో స్టాండ్‌ను సీఐ ఓబులేసు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులు యూనియన్ ఏర్పాటు చేసుకోవడంతో పాటు నిబంధనలను పాటిస్తూ ప్రయాణికులకు, ప్రభుత్వానికి సహకరించాలన్నారు. ఆటో ఎఫ్‌సీ, ఆర్‌సీ, ఇన్సూరెన్స్, డ్రైవింగ్ పత్రాలను డ్రైవర్ వద్ద ఉంచుకోవాలని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయరాదని, సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సీఐని కార్మికులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

లైసెన్సుల పరిశీలన



దుకాణాల్లో తనిఖీ చేస్తున్న అధికారులు

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో దుకాణాల లైసెన్సులను అధికారులు పరిశీలించారు. మంగళవారం ఈఓపీఆర్డీ పురుషోత్తం, డీడీఓ శ్రీనివాసరావు దుకాణాలను తనిఖీ చేసి లైసెన్సులు, సరుకుల అమ్మకాల్లో తేడాలు, నాణ్యత, పరిమాణం అంశాలకు సంబంధించి ఆరా తీశారు. కల్తీ సరుకుల అమ్మకాలు చేపట్టకూడదని వ్యాపారులను హెచ్చరించారు.

భీమానగర్‌లో నిర్మిస్తున్న కాలువ



23వ వార్డులో నిర్మించిన కల్వర్టు



నాడు అపరిష్కృతం.. నేడు పరిష్కారం

- రూ.1.20 కోట్ల నిధులతో నాలుగు వార్డుల్లో రోడ్లు, కాలువలు
- రూ.2 కోట్ల నిధులతో టీటీడీ కల్యాణ మండపానికి నేడు భూమిపూజ
- నగరి అభివృద్ధిలో మంత్రి ఆర్‌కే రోజా ప్రత్యేక ముద్ర

నగరి : నాడు గత పాలకులు అపరిష్కృతమని వదలిపెట్టిన సమస్యలు అన్నింటినీ నేడు మంత్రి ఆర్‌కే రోజా చొరవ తీసుకుని పరిష్కరిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలతో ప్రత్యక్షంగా చర్చించి వారికి అవసరమైన పనులను గుర్తించిన మంత్రి ఆర్‌కే రోజా అసాధ్యమైన పనులే అయినా సుసాధ్యం చేసుకుంటూ ప్రజల సమస్యలను తు.చ. తప్పకుండా పరిష్కరిస్తున్నారు. ఇందుకు పుదుపేట, ఏకాంబరకుప్పానికి చెందిన 12, 13, 23, 24 వార్డుల్లో రూ.1.20 కోట్ల నిధులతో జరిగే పనులే నిదర్శనంగా నిలుస్తోంది. భీమానగర్‌లో స్థల వివాదాల కారణంగా రెండు దశాబ్దాల పాటు కొనసాగిన మురుగు కాలువ, రోడ్డు సమస్యకు మంత్రి అందరితో చర్చించి పరిష్కారం చూపడంతో సమస్యకు తెరపడింది. 460 మీటర్ల దూరం మేర కుశస్థలి నది వరకు కాలువ



సమస్యాత్మక ప్రాంతంలో నిర్మిస్తున్న కాలువ

నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. సమస్యాత్మకంగా ఉన్న కల్వర్టును నిర్మించడం, సిమెంటు రోడ్లు వేస్తుండడంతో ఈ ప్రాంతంలో సమస్య పరిష్కారమైంది.

టీటీడీ కల్యాణ మండపం.. ఒక సాధన

నగరి పట్టణంలో టీటీడీ కల్యాణ మండపం నిర్మిస్తారని పదేళ్లకుపైగా చెప్పుకుంటున్నా ఇప్పటి వరకు కార్యరూపం దాల్చలేదు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో మంత్రి ఆర్‌కే రోజా రూరల్ మండలంలోని బుగ్గ కాశీవిశ్వేశ్వరాలయ సమీపంలో రూ.2 కోట్ల నిధులతో నిర్మించే టీటీడీ కల్యాణ మండపానికి బుధవారం భూమిపూజ చేయనున్నారు. ఇప్పటికే ఆమె కల్యాణమండం నిర్మాణం నిమిత్తం పబ్లిక్ కాంట్రిబ్యూషన్ కింద రూ.40 లక్షలు టీటీడీకి అందించిన విషయం విదితమే. ఈ పనులకు టెండర్లు కూడా పూర్తి కావడంతో నిర్మాణ పనులు భూమిపూజతో ప్రారంభించనున్నారు. 500 మంది కూర్చునేలా మ్యారేజ్ హాలు, 200 మంది కూర్చునేలా డైనింగ్ హాలు దానికి అనుబంధంగా కిచెన్, స్టోర్ రూం, వరుడు, వధువులకు, బాత్రూమ్ ఉండేలా కల్యాణ మండపం నిర్మించనున్నారు. నగరి, నింద్ర, విజయపురం మండలాలకు చెందిన సుమారు 60 గ్రామాల ప్రజలకు ఈ కల్యాణ మండపం ఉపయోగపడనుంది. పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బంది లేకుండా తక్కువ వ్యయంతో పెళ్లిళ్లు చేసుకునే సౌకర్యం ఉంటుంది. పార్కింగ్ సమస్య ఉండదు. ఆలయం, శంకరమఠం లాంటివి పక్కన ఉన్నందున వచ్చే వారికి బసతో పాటు అన్ని విధాలుగా సౌకర్యంగా ఉంటుంది. అపరిష్కృతంగా ఉన్న కాలువ సమస్యకు పరిష్కారం దొరకడంతో పాటు కల్వర్టు నిర్మించడం, రోడ్డు పనులు కూడా చకచక ప్రారంభం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

దశాబ్దాల సమస్య పరిష్కారమైంది..



మురుగు కాలువ సమస్య కొన్ని దశాబ్దాల పాటు మమ్మల్ని వదలకుండా పీడించింది. ఎన్నోసార్లు ఈ సమస్యపై గతంలో పోరాడాం ఫలితం దక్కలేదు. మంత్రి ఆర్కేరోజా గడపగడపకు కార్యక్రమంలో మా గడప వద్దకు వచ్చిన సమయంలో సమస్యను ఆమెకు విన్నవించుకున్నాం. సమస్య పరిష్కారానికి ఆమె చొరవ చూపారు. నేడు కాలువ నిర్మించి సిమెంటురోడ్డు వేస్తున్నారు. మంత్రికి కృతజ్ఞతలు.

– అమ్ములు, భీమా నగర్, నగరి మున్సిపాలిటీ

సమస్యను అర్థం చేసుకున్నారు



ఎంతోమంది నాయకులు ఎన్నికల సమయంలో వచ్చి వెళ్తుంటారు. అందరికీ సమస్య చెప్పుకుంటూనే ఉన్నాం. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంత్రి ఆర్కేరోజా వచ్చిన సమయంలో చెప్పుకున్నాం. అయితే ఇంత త్వరగా సమస్య పరిష్కారం అవుతుందనుకోలేదు. మంత్రి ఆదేశాలతో నిధులు మంజూరు కాడంతో స్థానిక కౌన్సిలర్లు పనులు చకచకా చేస్తున్నారు.

– బాలకృష్ణన్, భీమానగర్, నగరి మున్సిపాలిటీ

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత



మెడికల్ కిట్లు అందజేస్తున్న అధికారులు



శ్రీరంగరాజపురం: వైద్యసేవల గురించి వివరిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

వెదురుకుప్పం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఈఓపీఆర్డీ పురుషోత్తం అన్నారు. మంగళవారం మండలంలోని కొమగుంటలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. ఇందులో 333 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పేదలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతిఒక్కరూ ఆరోగ్యంగా ఉండాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిమతమన్నారు. జగనన్న సురక్ష శిబిరాల ద్వారా అన్ని రకాల వ్యాధులకు ఉచితంగా కార్పొరేట్ స్థాయి వైద్యసేవలను గ్రామీణుల చెంతకే అందుబాటులోకి తీసుకురావాలన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. అనంతరం మెడికల్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి సురేఖ, డీడీఓ కుమార్, సర్పంచ్‌లు దాక్షాయణి(కొమరగుంట), మమత(ఇనాంకొత్తూరు), సచివాలయ కన్వీనర్ జగదీశ్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు రక్ష.. ఆరోగ్య సురక్ష

శ్రీరంగరాజపురం: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం పేదలకు శ్రీరామరక్షగా నిలుస్తోందని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంగా మండలంలోని పద్మపురం సచివాలయం పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని స్థానిక సర్పంచ్ భాస్కర్‌నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రతి ఇంటినీ, ప్రతి కుటుంబాన్ని జల్లెడ పట్టి ప్రజల గడప వద్దకే వెళ్లి నాణ్యమైన వైద్యం అందించడానికే ప్రభుత్వం ఈ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం అమలు చేస్తోందన్నారు. కార్యక్రమానికి వచ్చిన 440 మంది రోగులను వైద్యులు పూర్తిస్థాయిలో పరీక్షించి మందులను ఉచితంగా అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆల్ఫ్రెడ్, వైద్యాధికారులు డాక్టర్ సందీప్, గిరి, బాలసుబ్రమణ్యం రెడ్డి, గౌరి, మండల కన్వీనర్ మణి, నాయకులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



కొప్పేడు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ

నింద్ర: మండలంలో ఎన్నికలు నిర్వహించే పోలింగ్ కేంద్రాలను నగరి ఆర్డీఓ వెంకటరెడ్డి మంగళవారం పరిశీలించారు. కొప్పేడు గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులను ఆయన పరిశీలించారు. మండలంలోని పలు గ్రామాల్లో పోలింగ్ కేంద్రలను పరిశీలించి ఎన్నికలు నిర్వహించేందుకు ఆరా తీశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నాగమణి, డీటీ నాగరాజు తదితరులు ఉన్నారు.


ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ



ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న డ్వాక్రా మహిళలు

పాలసముద్రం : ప్రతి పౌరుడు సంపూర్ణంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఐకేపీ ఏపీఎం ఫరీదు మస్తాన్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం దళితవాడలో డ్వాక్రా సంఘ సభ్యులతో కలసి ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటు వేసి మంచి పాలకున్ని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీసీ లోకనాథం, చిరంజీవి, సంఘమిత్ర మురగయ్య, బాలాజీ, శోభ, మంజుల, డ్వాక్రా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

16న సార్వత్రిక సమ్మె



కరపత్రాలు విడుదల చేస్తున్న కార్మిక సంఘ నాయకులు

పుత్తూరు: రైతు, కార్మిక సంఘాల పిలుపు మేరకు ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పిలుపు నిచ్చారు. మంగళవారం పట్టణంలో సమ్మె కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ రైతు ఉత్పత్తులకు కనీస ధర కల్పించడంలోనూ, కార్మికులకు కనీస వేతనం అమలు చేయడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తోందని ఆరోపించారు. కేంద్రప్రభుత్వ తీరును నిరసిస్తూ, రైతు, కార్మిక వర్గాల డిమాండ్ల సాధనకు నిర్వహిస్తున్న దేశవ్యాప్త సమ్మెను తిరుపతి జిల్లాలో విజయవంతం చేయడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు రాధాకృష్ణ, శ్రీరాములు, మహేష్, హైమావతి, చంద్రబాబు, చిరంజీవి, శరవణ, చెంగయ్య, చంద్రశేఖర్, కృష్ణారెడ్డి, ధన, మారమ్మ, భారతి తదితరులు పాల్గొన్నారు.

మండల అధికారులతో సమీక్ష



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్

శ్రీరంగరాజపురం : మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్రీనివాసులు మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసి కార్యాలయ రికార్డులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్, ఎంపీడీఓ, హౌసింగ్ ఏఈ, బీఎల్ఓ, పంచాయతీ కార్యదర్శి, వీఆర్ఓలతో జగనన్న కాలనీ పట్టా రిజిస్ట్రేషన్‌పై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్‌లో తప్పిదాలకు చోటు లేకుండా సమగ్రంగా నిర్వహించాలని సూచించారు. కొత్త ఓటర్ల నివేదికను రిటర్నింగ్ అధికారులు ఈ నెల 15వ తేదీలోపు కలెక్టరేట్‌కు పంపాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని వేగవంతం చేసి కులగణన, ఈకేవైసీ సర్వేలను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆల్ఫ్రెడ్, ఎంపీడీఓ కృష్ణయ్య, హౌసింగ్ ఏఈ శ్రీధర్, డీటీ లోకనాథపిళ్లై పాల్గొన్నారు.

రైతులకు అవగాహన



అవగాహన కల్పిస్తున్న టీమ్ లీడర్ తమిజోళి

నగరి : స్థానిక ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు మంగళవారం కామన్‌వెల్త్ ఆఫ్ లెర్నింగ్ కెనడా వారి సహకారంతో రైతులకు వివిధ పంటలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సంస్థ తరఫున విచ్చేసిన టీం లీడర్ పి.తమిజోళి, ఆఫ్‌కాబ్ మైక్రో లెర్నింగ్ సెంటర్ టీమ్ లీడర్ కె. మస్తాన్‌రావ్ రైతులకు మైక్రో లెర్నింగ్ సెంటర్ యాప్‌పై అవగాహన కల్పించారు. ఈ యాప్‌ను 54 దేశాల్లో వినియోగిస్తున్నారని, మన దేశంలో కూడా రైతుల కోసం ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. దీని ద్వారా రైతులు సజ్జ, చెరకు, వేరుశనగ, వరి లాంటి పంటల సాగు చేయడంతో పాటు ఈ పంటల్లో వచ్చే తెగుళ్ల నివారణకు ఏ మందులు పిచికారీ చేయాలి ? ఎంత మోతాదులో చేయాలనే అంశాలపై అవగాహన పెంచుకోవచ్చన్నారు. సందేహాలను అందులోని ఫోన్ నంబర్లలో సంప్రదించి నివృత్తి చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో స్టాఫ్ అసిస్టెంట్ అర్షియా రహమత్, చిత్తూరు పీడీసీ సేల్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, వ్యవసాయ అధికారి రాఘవేంద్రయాదవ్, సంఘ అధ్యక్షుడు తిరుమలరెడ్డి, సీఈఓ తులసిపిళ్లై, సూపర్‌వైజర్ ఆనంద్, శేఖర్, కార్తిక్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పాలిట వరం సీఎం రిలీఫ్ ఫండ్



అష్రాఫ్ కుటుంబసభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందిస్తున్న నాయకులు

కార్వేటినగరం: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న సీఎం సహాయనిధి పేదల పాలిట ఓ వరంగా నిలుస్తోందని జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ అన్నారు. మంగళవారం ఆయన బాధిత కుటుంబాలకు సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మండల కేంద్రంలోని ముస్లిం కాలనీకి చెందిన షరీఫ్ కుమారుడు అష్రాఫ్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.3.20 లక్షల చెక్కును స్థానిక సర్పంచ్ ధనంజయవర్మ, ముస్లిం మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హమీద్‌ఖాన్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అష్రాఫ్ ఆస్పత్రిలో ఉన్న విషయాన్ని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన వెంటనే సీఎం రిలీఫ్ ఫండ్‌ను మంజూరు చేయించి బాధిత కుటుంబాన్ని ఆదుకున్నారని తెలిపారు. గతంలో ఎన్నో ప్రభుత్వాలను చూశామని, కానీ సమస్య చెప్పగానే తక్షణమే స్పందించి బాధిత కుటుంబాలను ఆదుకుంటున్న ఘనత సీఎం జగనన్నకు, డిప్యూటీ సీఎం నారాయణస్వామికే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ శేషాద్రి, ముస్లిం నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఆదర్శ ఫౌండేషన్ స్కూల్‌గా పద్మసరసు



అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శిస్తున్న రాష్ట్ర విద్యాశాఖ బృందం

కార్వేటినగరం : ఆదర్శ ఫౌండేషన్ స్కూల్‌గా పద్మసరసు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఎంపిక చేసినట్లు రాష్ట్ర విద్యాశాఖ బృంద అధికారులు బాలకృష్ణ, గీత తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని పద్మసరస్సు తూర్పు హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రాలను రాష్ట్ర విద్యాశాఖ బృందం సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లల సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల సామర్థ్యాలు భేష్ అన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ పద్మసరస్సు అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆదర్శ ఫౌండేషన్ స్కూల్‌గా గుర్తించి అనేక వసతులు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఏ టీఎంఓ జయప్రకాష్, డైట్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ సుబ్రమణ్యం, ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, సీడీపీఓ పద్మసునంద, డైట్ అధ్యాపకులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

- 16న సప్త వాహనాలపై దర్శనమివ్వనున్న పద్మావతి అమ్మవారు

తిరుచానూరు(చంద్రగిరి): ఈ నెల16న రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో మంగళవారం కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం ఘనంగా నిర్వహించారు. ఉదయం 6.30 నుండి 9 గంటల వరకు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం చేపట్టారు. ఆలయ ప్రాంగణం, గోడలు, పైకప్పు, పూజాసామగ్రి తదితర అన్ని వస్తువులను నీటితో శుద్ధి చేశారు.

సప్త వాహనాలపై విహరించనున్న అమ్మవారు

ఈ నెల 16వ తేదీన రథసప్తమి సందర్భంగా శ్రీవారి పట్టపురాణి శ్రీపద్మావతి అమ్మవారు సప్త వాహనాలపై భక్తులను కటాక్షించనున్నారు. 16న ఉదయం 7.15 నుండి 8.15 గంటల వరకు సూర్యప్రభ వాహనం, ఉదయం 8.45 నుండి 9.45 గంటల వరకు హంస వాహనం, ఉదయం 10.15 నుండి 11.15 గంటల వరకు అశ్వ వాహనం, ఉదయం 11.45 నుండి మధ్యాహ్నం 12.45 గంటల వరకు గరుడ వాహనంపై విహరించి అమ్మవారు భక్తులను కటాక్షించనున్నారు. మధ్యాహ్నం 1.15 నుండి 2.15 గంటల వరకు చిన్న శేష వాహనం, సాయంత్రం 6 నుండి రాత్రి 7 గంటల వరకు చంద్రప్రభ వాహనం, రాత్రి 8.30 నుండి 9.30 గంటల వరకు గజ వాహనంపై దర్శనమిస్తారు. మధ్యాహ్నం 3.30 నుండి సాయంత్రం 4.30 గంటల వరకు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలోని శ్రీకృష్ణ స్వామివారి ముఖ మండపంలో అమ్మవారి ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో నిర్వహించే అన్ని సేవలను టీటీడీ రద్దు చేసింది.

ఎన్నికల రణభేరికి వైఎస్సార్‌సీపీ సిద్ధం

- త్వరలో జరిగే ఎన్నికలు ధర్మానికి, అధర్మానికీ మధ్యనే..
- జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసి యాదవ్



13జీడీఎన్61 బైక్ ర్యాలీ చేపట్టిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పాలసముద్రం : త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు, ధర్మానికి – అధర్మానికి మధ్య జరుగుతాయని, ప్రతి వైఎస్సార్‌సీపీ నాయకుడు, కార్యకర్త యుద్ధానికి సిద్ధం కావాలని జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్, మండల కన్వీనర్ తులసి యాదవ్ తెలిపారు. మంగళవారం బలిజకండ్రిగలో పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు, డిప్యూటీ సీఎం నారాయణస్వామి పిలుపుమేరకు మండల పార్టీ నాయకుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. మండల కన్వీనర్ తులసి యాదవ్ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు ఎన్ని కుయుక్తులతో వచ్చినా, సీఎం జగనన్న అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే మన ఆయుధాలన్నారు. గత టీడీపీ ప్రభుత్వం 600 హామీలు ఇచ్చి ఒక్క హామీని కూడా అమలు చేయని పరిస్థితి తెలిసిందే అన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 95 శాతం నెరవేర్చారని తెలిపారు. అనంతరం సుమారు 500 మంది బలిజకండ్రిగ నుంచి రంగాపురం క్రాస్, నరసింహపురం, తిరుమళరాజుపురం వరకు బైక్ ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఆర్బీకే చైర్మన్ పోలయ్య, ఎంపీటీసీలు గోవిందరాజ్, లిఖిత, సర్పంచ్ భాస్కర్ రెడ్డి, మహేష్ బాబు, నరసింహరాజు, జీవిత, అనురేఖ, నాయకులు సుబ్రమణ్యారెడ్డి, షన్ముగరెడ్డి, వేణు, కృష్ణయ్య, చిన్నపయ్యన్, అరుల్, పయణి, మురుగేష్, రవిరెడ్డి, నరసింహన్, నాగరాజ్, అనత్రాజ్, శేఖర్, సతీష్, గజేంద్రన్, పేదనాయగం, దనపాల్, త్యాగరాజ్, ఇతర శ్రేణులు పాల్గొన్నారు.